తవ్వారు.. వదిలేశారు

- కొన్నేళ్లుగా పునర్ నిర్మాణానికి నోచుకోని సీసీరోడ్లు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పలు డివిజన్లలో కనీసం అంబులెన్స్ కూడా వెళ్లలేని పరిస్థితి


హనుమాన్ నగర్ ఏరియాలోని సీసీరోడ్డు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ పలు డివిజన్ల ఏరియాల్లోని సీసీరోడ్లను అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం తవ్వారు. డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తి చేశారు. కానీ మళ్లీ సీసీరోడ్లు నిర్మించకపోవడంతో ఆయా ఏరియాల్లోని ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గత ప్రభుత్వ పాలనలోనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం రోడ్లను తవ్వి డ్రైనేజీ వ్యవస్థను పూర్తి చేశారు. అప్పుడే సీసీరోడ్లను పునఃనిర్మిస్తామని చెప్పిన అధికారులు, ప్రజాప్రతినిధులు కొన్ని ఏరియాల్లో నిర్మించి మిగిలిన ఏరియాల్లో నిర్లక్ష్యంగా వదిలేశారు.

గుంతలమయం..

యైటింక్లయిన్‌కాలనీ 18వ డివిజన్ హనుమాన్ నగర్, 17వ డివిజన్ సంతోష్‌నగర్ ఏరియాల్లో సీసీరోడ్లు నిర్మించకపోవడంతో ఆయా ఏరియాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా హనుమాన్ నగర్ ఏరియా సీసీరోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనాలు అదుపుతప్పి డివిజన్ వాసులు ప్రమాదాలకు గురవుతున్నారు. అంతేకాకుండా వర్షాకాలంలో రోడ్డుపై నీరు నిలవడంతో నడవలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా రామగుండం కార్పొరేషన్ అధికారులు స్పందించి ఆయా ఏరియాల్లోని సీసీరోడ్లను తిరిగి నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వర్షాకాలంలో బురదమయం..

కొద్దిపాటి వర్షానికే ఆయా ఏరియాల్లోని రోడ్లు వరద నీటితో పాటు బురద నీరు రోడ్లపై నిలిచి రోడ్లన్నీ బురదగా మారుతున్నాయి. దీంతో ప్రజలు రోడ్లపై నడవాలంటే ఇబ్బంది పడుతున్నారు. అంతేకాకుండా ఏదైనా ప్రమాదం జరిగితే కనీసం అంబులెన్స్ కూడా రాని పరిస్థితి నెలకొంది. వర్షాకాలంలో బురదనీరు ఇళ్లలోకి వస్తుందని వాపోతున్నారు.

సీసీరోడ్డు నిర్మించాలి



కొన్నేళ్ల నుంచి సీసీరోడ్డు తవ్వడంతో గుంతలు ఏర్పడి నడవలేని పరిస్థితి నెలకొంది. చాలా ఇబ్బంది పడుతున్నాం. అధికారులు తక్షణమే హనుమాన్ నగర్ ఏరియాలోని సీసీ రోడ్డును తిరిగి నిర్మించాలి.

– మల్లయ్య, హనుమాన్‌నగర్

అధికారులు పట్టించుకోవాలి



హనుమాన్‌నగర్‌లోని సీసీరోడ్డును తవ్వడంతో రోడ్డు మొత్తం గుంతలమయంగా మారింది. చిన్నపాటి వర్షానికే బురద నీటితో నిలిచి ఉంటుంది. కాలనీకి ఇదే ప్రధాన రహదారి. అధికారులు స్పందించి వెంటనే మా ఏరియాలో సీసీరోడ్డు నిర్మించాలి.

– సుధారాణి, హనుమాన్‌నగర్

త్వరలో పనులు చేపడతాం

యైటింక్లయిన్‌కాలనీలోని పలు డివిజన్ ఏరియాల్లో సీసీరోడ్ల నిర్మాణం కోసం దాదాపు రూ.15కోట్ల నిధులు మంజూరయ్యాయి. సీసీరోడ్లు లేని ఆయా ఏరియాల్లో ఎంపిక చేసిన రోడ్లకు తిరిగి త్వరలోనే నిర్మాణ పనులు చేపడతాం.

– రామన్(ఈఈ), జమీల్ (డీఈ)

క్లుప్తంగా

తాగునీటి ఇబ్బందులు రానివ్వం


బావిని పరిశీలిస్తున్న కమిషనర్ నియాజ్

సుల్తానాబాద్: వేసవికాలంలో పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ నియాజ్ అన్నారు. మండల కేంద్రంలోని గట్టెపల్లి మానేరు వాగులో రక్షిత మంచినీటికి సరఫరా చేసే మోటర్ మరమ్మతు పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గట్టెపల్లి మానేరు పరివాహక ప్రాంతం నుంచి నిత్యం పట్టణంలోని అశోక్‌నగర్ బావికి నీటి సరఫరా జరుగుతుందన్నారు. అక్కడి నుంచి పట్టణంలోని పలు కాలనీలకు నీటి సరఫరా జరుగుతుందని వివరించారు. ఎక్కడ పైపులైన్ లీకేజీలు ఉన్నా సత్వరమే స్పందించి వాటిని పరిష్కరిస్తున్నామని తెలిపారు. మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో పూజలు


మొక్కులు చెల్లిస్తున్న మహిళలు

ఎలిగేడు: మండలంలోని ధూళికట్ట గ్రామంలోని శ్రీరేణుక ఎల్లమ్మతల్లికి పంబాల కులస్తులు పూజలు చేశారు. నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. అందరూ బాగుండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని, పశువులు బాగుండాలని అమ్మవారిని వేడుకున్నారు.

పరిసరాల పరిశుభ్రత

సుల్తానాబాద్: పట్టణంలోని శివాలయం, రాజరాజేశ్వర ఆలయం, శాస్త్రినగర్, పూసాలలో ఉన్న శివాలయాల పరిసరాలను మహాశివరాత్రి సందర్భంగా మున్సిపల్ కార్మికులు శుభ్రం చేశారు. మంగళవారం కార్మికులు ఆలయాల ముందు అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాన్ని శుభ్రం చేశారు. మహాశివరాత్రికి హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు అన్నిరకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

మహిళల భద్రతకు భరోసాగా ఉంటాం

గోదావరిఖని: మహిళల భద్రతకు భరోసా ఇస్తున్నామని, ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఫోన్ చేస్తే అందుబాటులో ఉంటామని షీటీం ఇన్‌చార్జి లావణ్య అన్నారు. పెద్దపల్లి, రాఘవాపూర్ గ్రామాల్లో మంగళవారం హైస్కూల్ విద్యార్థులకు భద్రత గురించి అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఎవరైనా వేధింపులకు గురైతే 63039 23700 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. షీటీమ్ సభ్యులు మౌనిక, సురేశ్, హెడ్‌మాస్టర్ హనుమంత్ పాల్గొన్నారు.

కొలనూర్‌లో పొలంబాట


పొలంబాటలో విద్యుత్ సిబ్బంది

ఓదెల: విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం రైతులు 1912 టోల్ ఫ్రీకి ఫోన్ చేయాలని ఓదెల ట్రాన్స్‌కో ఏఈఈ మోహన్‌నాయక్ పేర్కొన్నారు. మండలంలోని కొలనూర్ గ్రామంలో మంగళవారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినా, తీగలు మండినా, వేలాడే కరంట్ వైర్లు బాగుచేయడానికి పొలంబాట కార్యక్రమం ద్వారా పరిష్కరిస్తామని ఏఈఈ పేర్కొన్నారు. పంటపొలాల్లో ఎలాంటి విద్యుత్ స్తంభాలు, తీగలతో ఎలాంటి సమస్య ఉన్నా తమకు సమాచారం అందించాలన్నారు.

ఉన్నత విద్యే లక్ష్యంగా పురోగతి సాధించాలి

ధర్మారం: విద్యార్థులు ఉన్నత విద్యే లక్ష్యంగా పురోగతి సాధించి తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని జిల్లా మహిళా సాధికారత కోఆర్డినేటర్ దయ అరుణ సూచించారు. మండలంలోని పత్తిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పరీక్ష సమయంలో ప్రత్యేక దృష్టిసారించి 10జీపీఏ సాధించడానికి శ్రమించాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బ్లాండీనా, పాఠశాల ఉపాధ్యాయులు చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ ఉమాదేవి, సఖీ లీగల్ కౌన్సిలర్ సుమతి పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్: పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. పట్టణంలోని యశోద నరహరి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం సుల్తానాబాద్, ఓదెల మండలాల ముఖ్య నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూకాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి గెలుపు కోసం పనిచేయాలన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, సుల్తానాబాద్ మార్కెట్ చైర్మన్ ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

ఓదెల: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలని ఎమ్మెల్యే విజయరమణారావు పిలుపునిచ్చారు. ఓదెలలో మంగళవారం కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులతో సమావేశం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి వూట్కూరి నరేందర్‌రెడ్డి గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలన్నారు. పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్ రెడ్డి, మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి, నాయకులు, పట్టభద్రులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శివపల్లిలో సమావేశం

ఎలిగేడు: కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపు కోసం పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే విజయరమణారావు పిలుపునిచ్చారు. మండలంలోని శివపల్లిలోని ఎమ్మెల్యే తన నివాసంలో మంగళవారం ఎలిగేడు, జూలపల్లి మండలాల పార్టీ ముఖ్య నాయకులతో, పట్టభద్రులతో సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి ఓటువేసేలా కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ రాష్ట్ర యూత్ నాయకులు దుగ్యాల సంతోష్‌రావు, ఎలిగేడు మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, ధూళికట్ట సింగిల్‌విండో చైర్మన్ పుల్లూరి వేణుగోపాల్‌రావు, బాలుసాని పర్శరాములుగౌడ్, కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, కొండ తిరుపతిగౌడ్, అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, బూర్ల వెంకటసత్యం, వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

మంత్రి పరామర్శ


నివాళి అర్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని: మంథనిలో వారంరోజుల క్రితం విశ్రాంత అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ ఇనుముల శంకరయ్య ఆకస్మికంగా మృతిచెందారు. ఆయన చిత్రపటం వద్ద మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంగళవారం నివాళి అర్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఐలి ప్రసాద్, నాయకులు మూల పురుషోత్తంరెడ్డి, ఆకుల కిరణ్, పోలు శివ, మంథని వేణు ఉన్నారు.

పెద్దపల్లి ఏసీపీ ఔదార్యం


నగదు అందజేస్తున్న ఏసీపీ కృష్ణ

ఓదెల: మండలంలోని కొలనూర్‌లో మాటూరి స్వర్ణలతకు చెందిన ఇల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. మంగళవారం సమాచారం తెలుసుకున్న పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ బాధితురాలు స్వర్ణలతకు రూ.10వేలతో పాటు 75కిలోల బియ్యం, నెలరోజులకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేసి ఔదార్యం చాటుకున్నారు. సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, పొత్కపల్లి ఎస్సై దికొండ రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుల్తానాబాద్: పెద్దపల్లి పట్టణంలోని రంగంపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో గల పెద్దపల్లి టౌన్–1 ఫీడర్ లో బుధవారం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 2:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. పెద్దపల్లి పరిధిలో గల శివపురి కాలనీ, భూంనగర్ డౌన్, ఆర్కే గార్డెన్ ఏరియా, ముకుందరెడ్డి అపార్ట్‌మెంట్ ఏరియాలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

• కుక్కలదాడిలో వృద్ధురాలికి తీవ్రగాయాలు

ఓదెల: మండలంలోని హరిపురంలో కర్రె కనుకమ్మ అనే వృద్ధురాలిపై కుక్కలు దాడిచేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం కనుకమ్మ కుట్టుమిషన్ దగ్గరకు వెళ్తుండగా అకస్మాత్తుగా కుక్కలు దాడిచేశారు. గాయాలు కావడంతో స్పృహ కోల్పోయింది. కాళ్లు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం కొలనూర్ హాస్పిటల్‌కు తరలించారు.

• శివలింగ పునఃప్రతిష్టాపనోత్సవాలు

మంథని: మున్సిపల్ పరిధిలోని పోచమ్మవాడ శివనాగపురిలో శివలింగ జీర్ణోద్ధరణ, పునఃప్రతిష్టాపన ఉత్సవాలు ఈ నెల 20, 21న నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పోచమ్మవాడలోని శివ నాగేంద్ర దేవాలయం వద్ద గల శివలింగం జీర్ణోద్ధరణ, పునః ప్రతిష్టాపన కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు వారు తెలిపారు.

• అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయండి

మంథని: బీజేపీ ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ అభ్యర్థి అంజిరెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమరయ్యను గెలిపించి పార్టీ సత్తా చాటాలని పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రభారీలకు ప్రచారంలో అనుసరించాల్సిన విధి విధానాలను వివరించారు.

• ఆధ్యాత్మిక లఘు చిత్రం విడుదల

జ్యోతినగర్: శ్రీఅయ్యప్పస్వామి వారి మహిమలు తెలిపే అహం బ్రహ్మాస్మి లఘుచిత్రాన్ని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ సోమవారం రాత్రి విడుదల చేశారు. ఈ లఘు చిత్రానికి అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ సభ్యుడు జనగామ తిరుపతి నిర్మాతగా వ్యవహరించారు.

• ఓబీ కాంట్రాక్టు కార్మికుల సమ్మెకు మద్దతు

గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమ్మెకు జేఏసీ నాయకులు మంగళవారం మద్దతు ప్రకటించారు. సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సీఐటీయూ, టీయూసీఐ, ఐఎఫ్‌టీయూ, కార్మిక సంఘాల నాయకులు వేల్పుల కుమారస్వామి, తోకల రమేశ్, ఇ.నరేశ్ మాట్లాడారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. అంతేకాకుండా కనీస వేతనాలతో పాటు కనీస సౌకర్యాలు, రక్షణ పరికరాలు కూడా అందజేయాలన్నారు. నాయకులు నెర్వట్ల నర్సయ్య, రాజేశం పాల్గొన్నారు.

• పోస్టర్ ఆవిష్కరణ

ధర్మారం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక సామాన్య ప్రజలపై భారం పడుతోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో మంగళవారం బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక వైఖరిని నిరసిస్తూ, బడ్జెట్ కార్మికవర్గంపై ప్రభావం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు.

• విద్యుత్ షాక్.. ఒకరికి గాయాలు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పెగడపల్లికి చెందిన పిక్కల కొమురయ్య అనే ప్రయివేటు ఉద్యోగి సోమవారం సాయంత్రం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఫీజులు సరి చేస్తూ తీవ్రగాయాల పాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. చికిత్స కోసం కరీంనగర్‌కు అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. తలకు, చేతులకు, వీపు, భుజాలకు గాయాలయ్యాయి. కొమురయ్య ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే కొమురయ్య షాక్‌కు గురైనట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఏడీని వివరణ కోరగా తాను సెలవులో ఉన్నానని, షాక్‌కు గురైన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తనకు సమాచారం ఉందన్నారు. ఇటీవల పెగడపల్లి, నాంసానిపల్లె ఫీడర్ల లైన్లు మార్చారని, దీంతో పొరపాటున కొమురయ్య షాక్‌కు గురైనట్లు తెలిసిందని ఏడీ పేర్కొన్నారు.

• 28 వరకు కులగణన వివరాల నమోదు

రామగుండం: కులగణన సమయంలో వివరాలు నమోదు చేసుకోలేని వారు 28లోగా అంతర్గాం మండల పరిషత్ కార్యాలయంలో నమోదు చేసుకునే అవకాశం కల్పించినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో బైరి వేణుమాధవ్ తెలిపారు.

• పోస్టుకార్డు ఉద్యమం

రామగిరి: రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యమకారులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని మంగళవారం ఉద్యమకారులు పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. ఉద్యమఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు సీమ శ్రీనివాస్ ఆదేశాల మేరకు సెంటినరికాలనీలో పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. హామీలను అమలు చేయాలని ఉత్తరాల ద్వారా సందేశం పంపించారు.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి


ప్రచారం చేస్తున్న నాయకులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలో బీజేపీ నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. పట్టభద్రుల స్థానానికి పోటీలో ఉన్న బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పోటీలో ఉన్న అభ్యర్థి మల్క కొమురయ్యను గెలిపించాలని చేపట్టిన ప్రచారంలో పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి పాల్గొని ఆమె మాట్లాడారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు సరైన నిర్ణయం తీసుకొని బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మిట్టపల్లి సతీశ్‌కుమార్, సీనియర్ నాయకులు గాండ్ల ధర్మపురి, తోట కుమారస్వామి, భూమయ్య, శ్రీకాంత్, రవికుమార్ పాల్గొన్నారు.

ఎస్‌బీఐ వార్షిక క్రీడాపోటీలు ప్రారంభం


పోటీల్లో పాల్గొన్న ఎస్‌బీఐ ఉద్యోగులు

జ్యోతినగర్: గోదావరిఖని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజియన్ స్పోర్ట్స్ మీట్ మంగళవారం సాయంత్రం ఎన్టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్ జ్యోతిక రిక్రియేషన్ క్లబ్‌లో ప్రారంభమైంది. చదరంగం, క్యారమ్స్, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ ఇండోర్ గేమ్స్‌ను రీజినల్ ఏజీఎం రవీంద్ర కుమార్‌సింగ్, హెచ్‌ఆర్ జీఎం విజయరావు క్రీడాపోటీలను ప్రారంభించారు. పోటీల్లో 42 బ్యాంకుల నుంచి 80మంది క్రీడాకారులు పాల్గొన్నారు.



పాలకుర్తి: బసంత్‌నగర్ సమీపంలోని కన్నాల టోల్‌ప్లాజా వద్ద ఫోర్ లేన్ రహదారిపై ఇష్టారాజ్యంగా లారీలు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రహదారిపై ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గోదావరిఖని, మంచిర్యాల, ఎన్టీపీసీ తదితర ప్రాంతాల నుంచి వచ్చే బొగ్గు లారీలు, కుందనపల్లి యాష్ పాండ్ నుంచి బూడిదను తరలించే లారీలతో పాటు ఆంధ్రప్రదేశ్ నుండి కర్రల లోడ్‌తో వచ్చే లారీలు టోల్‌ప్లాజా వద్ద రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేస్తున్నారు. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈప్రాంతంలో ఇష్టారీతిన లారీలు నిలిపి ఉంచడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెప్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు, స్థానిక పోలీసులు చొరవ తీసుకుని లారీలు నిలపకుండా తగిన చర్యలు చేపట్టాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.



వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం


మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

గోదావరిఖని: సంస్థలో ఫ్రీ మస్టర్లు తీసుకుని ఎవరూ పనిచేయడం లేదని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, ఆర్జీ–1 బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం అన్నారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో గుర్తింపు సంఘంగా గెలిచిన తర్వాత ఏఐటీయూసీ బాధ్యతగా వ్యవహరిస్తూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ముందుకు సాగుతున్నామన్నారు. హెచ్‌ఎంఎస్ నాయకుడు రియాజ్ అహ్మద్ చేస్తున్న ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. కార్మికవర్గం అనుభవిస్తున్న అనేక హక్కులు ఏఐటీయూసీ పోరాటం ద్వారానే వచ్చాయని గుర్తుచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలతో సింగరేణిలో నూతన గనులు రావడం లేదని ఆరోపించారు. తమ యూనియన్‌పై చౌకబారు మాటలు, విమర్శలు మానుకోవాలని హితవుపలికారు. నాయకులు తాళ్లపెల్లి మల్లయ్య, చెప్యాల మహేందర్‌రావు, హొడ్నాల మల్లయ్య, గాండ్ల కుమార్, సిరిసిల్ల మల్లేశ్, జేరిపోతుల దేవయ్య పాల్గొన్నారు.

ఆర్జీ–2 జీఎంకు సన్మానం

గోదావరిఖని: ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్యను సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించారు. సెక్టార్–3 సింగరేణి పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న సీబీఎస్‌ఈ విద్యకు సబంధించిన పనుల పురోగతి, పాఠశాల భవనం ఆధునీకరణ పనుల గురించి చర్చించారు. సీబీఎస్‌ఈకి సంబంధించిన అనుమతులు త్వరితగతిన పూర్తి చేయాలని జీఎం సూచించారు. ఎడ్యుకేషనల్ సెక్రటరీ వెంట పాఠశాల కరస్పాండెంట్ ఎస్.అనిల్‌కుమార్, తదితరులు ఉన్నారు.

మల్కాపూర్‌లో రోడ్డు పనులు ప్రారంభం


రోడ్డు పనులు పరిశీలిస్తున్న వెంగల బాపు

జ్యోతినగర్: సింగరేణి సంస్థ సీఎస్సార్ నిధులతో నిర్మిస్తున్న రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ మల్కాపూర్ గ్రామంలోని చెరువు కట్టపై సింగరేణి సంస్థ సీఎస్సార్ నిధులతో 350 మీటర్ల సీసీరోడ్డు పనులను డీసీసీ అధికార ప్రతినిధి వెంగల బాపు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ నిధులు కేటాయించడంపై కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ నర్సింగరావు, పసుల ప్రకాశ్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం


సన్మానిస్తున్న కార్మిక సంఘం నాయకులు

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన ముగ్గురు కార్మికులను మంగళవారం సన్మానించారు. కంపెనీలోని కార్మికుల విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్మికులు నంది నారాయణ, పన్నాల సాంబయ్య, గొట్టె కనుకయ్యను కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు మాదాసు శ్రీనివాస్ సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు బత్తిని సతీశ్, తీగల తిరుపతి, పూసల ప్రసాద్, సాదిక్, దాసరి శ్రీనివాస్, కాంట్రాక్టర్లు పుష్పేందర్, గోవింద్‌కుమార్, హెచ్‌ఆర్ అధికారులు సదానందం, శ్యాంకుమార్, బత్తిని విజయ తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

జ్యోతినగర్: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు చిలుక శంకర్ డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ రామగుండంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను సత్వరమే అమలు చేయాలని కోరారు. ఈనెల 20న హైదరాబాద్‌లో నిర్వహించే భారీ ప్రదర్శన, మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. నాయకులు స్వామి, రాయమల్లు, ఓదెమ్మ, కనకమ్మ, పద్మ, రజిత పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం

మంథని: కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని రాష్ట్ర ట్రేడ్‌కార్పొరేషన్ చైర్మన్, మంథని నియోజక వర్గ ఎమ్మెల్సీ ఎన్నికల కోఆర్డినేటర్ ఐత ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మంథని మండల పరిధిలోని పలు ప్రైవేటు పాఠశాలల్లోని పట్టభద్రులను సోమవారం కలిసి పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మద్దతుగా నిలవాలని కోరారు.